క్లుప్తంగా

వేడుకగా లక్ష్మీదేవి శీలవిరుపు



శీలవిరుపు మహోత్సవంలో భాగంగా తోమాల మందిరం వద్ద ప్రత్యేక అలంకరణలో ఉన్న మహాలక్ష్మీ దేవి

విజయనగరం టౌన్: నగరంలోని సంతపేట, దాసన్నపేటలో అంగరంగవైభవంగా నిర్వహిస్తున్న జగన్నాథుని రథయాత్ర మహోత్సవాల్లో భాగంగా గురువారం శీలవిరుపు కార్యక్రమాన్ని వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు నేతృత్వంలో అర్చకులు అమ్మవారికి విశిష్ట పూజాధికాలు చేశారు. మహిళల కోలాట ప్రదర్శనలు, గోవింద నామస్మరణలతో ఆ ప్రాంతమంతా భక్తిభావంతో నిండిపోయింది. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేక రథంలో ఉంచి తిరువీధి నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించి, తరించారు.

వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌ను కలిసిన ఉప్పాడ



వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితో ఉప్పాడ శివారెడ్డి

భోగాపురం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని భోగాపురం మండలం అమటాం రావివలస సర్పంచ్ ఉప్పాడ శివారెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. తాడేపల్లిలోని ఆయన నివాసంలో కలిసి పలు విషయాలపై చర్చించారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని కలిసిన వారిలో నందిగాం సర్పంచ్ గోరే మురళీ మోహన్, నాయకులు వైరెడ్డి ఎర్రప్పలనారాయణ, శీరపు గురునాథ్‌రెడ్డి ఉన్నారు.

ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకోవాలి



ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ పద్మలత, తదితరులు

నెల్లిమర్ల రూరల్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకోవాలని సతివాడ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ పద్మలత సూచించారు. పాఠశాలలో గత విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివి ఐఐఐటీకి ఎంపికైన విద్యార్థులను గురువారం పాఠశాల ఆవరణలో అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నూజువీడు, శ్రీకాకుళం క్యాంపస్‌లకు పాఠశాల నుంచి ఎనిమిది మంది విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. క్రమ శిక్షణతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌సీసీ సర్టిఫికెట్ల ప్రదానం

విజయనగరం అర్బన్: గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్‌సీసీ క్యాడెట్లకు గురువారం సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. మార్చి–2024లో జరిగిన ఎన్‌సీసీ – బీ పరీక్షల్లో ఉత్తీర్ణులైన సీతం ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన 20 మందికి, సత్య డిగ్రీ కళాశాలకు చెందిన 30 మందికి, ఉమాభారతి డిగ్రీ కళాశాలకు చెందిన 20 మందికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో సీతం కాలేజ్ డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు, సీతం ప్రిన్సిపాల్ డాక్టర్ రామమూర్తి, డీన్ డాక్టర్ నరేంద్ర, వైస్ ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి, సత్య డిగ్రీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ సాయిదేవమణి, ఉమాభారతి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అనిల్, సీతం కళాశాల లెఫ్టినెంట్ మజ్జి వరలక్ష్మి, లెఫ్టినెంట్ ఎస్.ప్రశాంత్, ఎస్‌ఓ కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు వేలంపాట

విజయనగరం: విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన న్యూ ఐడీఎస్ఎంటీ, పాత ఐడీఎస్ఎంటీ షాపింగ్ కాంప్లెక్స్‌లలో ఖాళీగా ఉన్న షాపులను అద్దె ప్రాతిపదికన కేటాయించేందుకు ఈనెల 12న వేలం నిర్వహించనున్నట్లు కమిషనర్ ఎం.మల్లయ్య నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 11 గంటలకు కార్పొరేషన్ కార్యాలయంలో గల సమావేశ మందిరంలో నిర్వహించనున్న వేలంపాటలో ఆసక్తి గల వారు పాల్గొనాలని కోరారు. పూర్తిస్థాయి వివరాలకు రెవెన్యూ విభాగంలో సంప్రదించాలని సూచించారు.

తల్లికి వందనం.. అందేనా..!



చంద్రబాబు ఎన్నికల మేనిఫెస్టో

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జగనన్న అమ్మఒడి పథకం కింద విద్యార్థి తల్లి బ్యాంక్ ఖాతాకు ఏడాదికి రూ. 15 వేలు జమ చేశారు. అదే పథకానికి పేరుమార్చి తాము అధికారంలోకి వస్తే ఒక్కో విద్యార్థికి రూ. 15 వేలు చొప్పున ఎంతమంది పిల్లలుంటే అంతమందికీ 'తల్లికి వందనం' పేరుతో నగదు అందజేస్తామని టీడీపీ, జనసేన నాయకులు ప్రకటించారు. ఈక్రమంలో కూటమి ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన జీఓలో ఒక తల్లికి రూ. 15 వేలు అందజేస్తామని ప్రకటించడంతో మహిళలు ఆందోళన చెందుతున్నారు. ఎంతమంది పిల్లలుంటే అంతమందికీ రూ. 15 వేలు చొప్పన అందజేస్తామని ప్రకటించి, ఇప్పుడు మాటమార్చడమేమిటని మండిపడుతున్నారు. పిల్లలందరికీ ఆర్థికసాయం అందజేసి మాట నిలబెట్టుకోవాలని కోరుతున్నారు.

– విజయనగరం/నెల్లిమర్ల నెట్‌వర్క్

ఆశగా ఎదురుచూస్తున్నాం..



మాకు ఇద్దరు ఆడపిల్లలు. నా భర్త విజయనగరంలోని ఓ దుకాణంలో పని చేస్తుంటారు. పిల్లలిద్దరినీ కష్టపడి చదివించుకుంటున్నాం. కూటమి ప్రభుత్వం వస్తే ఇద్దరు పిల్లలకు తల్లికి వందనం పేరుతో డబ్బులు వస్తాయని ఆశపడ్డాం. విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో అటు ఫీజులు, ఇటు పుస్తకాలు, యూనిఫారాల కొనుగోలుకు ఇబ్బంది పడుతున్నాం. ప్రభుత్వం ఇద్దరి పిల్లలకూ రూ. 15000 చొప్పున ఆర్థిక సాయం చేస్తుందని ఆశగా ఎదురుచూస్తున్నాం.

– అల్తి కృష్ణవేణి, కేఎల్‌పురం, విజయనగరం.

పథకం అమలు చేస్తే మేలు..



కొత్త ప్రభుత్వం ప్రకటించిన తల్లికి వందనం పథకం అమలు కోసం నాబోటి ఎంతో మంది మధ్య తరగతి మహిళలు ఎదురు చూస్తున్నారు. ఇంట్లో ఎంత మంది పిల్లలు చదువుకుంటే అంతమందికీ పథకాన్ని వర్తింపజేస్తారని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ ప్రకారం విద్యా సంవత్సరం ప్రారంభంలో అమలు చేస్తే మాలాంటి కుటుంబాలకు ఆసరాగా ఉంటుంది. నాకు ఇద్దరు పిల్లలు. భర్త చిరుద్యోగి. ప్రభుత్వం ప్రకటించిన తల్లికి వందనం పథకం అమలు చేస్తే పిల్లల చదువుకు ఉపయోగపడుతుంది.

– పోతుల అఖిల, గృహిణి, విజయనగరం

ఎంతో ఆశ పడ్డాం



టీడీపీ అధికారంలోకి వస్తే తల్లికి వందనం పథకం కింద ఎంతమంది పిల్లలుంటే అంత మందికీ రూ.15 వేలు చొప్పున ఇస్తామన్నారు. ఆ హామీతో ఎంతో సంతోషపడ్డాం. పిల్లలను బాగా చదివించుకుందామని మురిసిపోయాం. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత ఒకరికే సొమ్ము జమ చేస్తామని అం టున్నారు. ఇప్పటికే ఫీజులు చెల్లించాలని పాఠశాలల యాజమాన్యాలు ఒత్తిడి చేస్తున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ మేరకు ఎంతమంది ఉంటే అంత మంది పిల్లలకూ ప్రభుత్వం లబ్ధి చేకూర్చాలి.

మజ్జి స్వాతి, గృహిణి, సతివాడ గ్రామం

ఫీజులు అడుగుతున్నారు..



నాకు ఇద్దరు పిల్లలు. ప్రైవేట్ పాఠశాలలలో చదివిస్తున్నాం. తరగతులు ప్రారంభమై నెల రోజులవుతున్నా ఇంతవరకు తల్లికి వందనం మంజూరు చేయలేదు. పాఠశాల యాజమాన్యం ఫీజులు చెల్లించమని ఒత్తిడి తీసుకువస్తున్నారు. ప్రభుత్వం వెంటనే నా ఇద్దరు పిల్లలకు డబ్బులు ఇస్తుందనే ఆశతో ఎదురుచూస్తున్నాను.

– పెంటమాని రమణమ్మ, పూసపాటిరేగ

సహారా బాధితులకు డబ్బులు చెల్లించాలి

- సీఐటీయూ నాయకులు



మాట్లాడుతున్న సహారా బాధితులు, సీఐటీయూ నాయకులు

విజయనగరం ఫూల్‌బాగ్: సహారా ఇండియా సంస్థ ఖాతాదారులు, ఏజెంట్లకు పూర్తిగా డబ్బులు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు టి. సూర్యనారాయణ, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె. సురేష్, ఖాతాధారుల కమిటీ కన్వీనర్ బి. లక్ష్మీదాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈనెల 15న కలెక్టర్ ఆఫీస్ వద్ద చేపడుతున్న ధర్నాలో బాధితులందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఎల్‌బీజీ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, సహారా ఇండియా సంస్థ నమ్మిన ఖాతాదారులు, ఏజెంట్లను మోసం చేసిందన్నారు. ఖాతాదారులకు ఇచ్చిన బాండ్స్ సమయం ముగిసినా నేటికీ డబ్బులు ఇవ్వకుండా కాలయాపన చేస్తోందని మండిపడ్డారు. దేశవ్యాప్తంగా నాలుగు కోట్లకు పైగా బాధితులున్నారని, ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎ. నాయుడు, బాలకృష్ణ, పి. శ్రీనివాస్, రాజశేఖర్, మోహనరావు, సాయికృష్ణ, శ్రీనివాసరావు, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలను అరికట్టాలి

- ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు బూర వాసు



నిరసన తెలియజేస్తున్న విద్యార్థులు

విజయనగరం ఫూల్‌బాగ్: యువత జీవితాలను చిత్తు చేసే మాదకద్రవ్యాలను అరికట్టాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు బూర వాసు కోరారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా స్థానిక మయూరి జంక్షన్ వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల రవాణా, వినియోగంపై రాష్ట్ర ప్రభుత్వం ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. మాదకద్రవ్యాల మత్తులో యువకులు అసాంఘిక కార్యక్రమాలు పాల్పడుతున్న సంఘటనలు రాష్ట్రంలో జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వంశీ, నాగరాజు, శ్రీను, లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

బాలికల వసతిగృహాన్ని మార్చండి



న్యాయ అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి విజయకల్యాణి

- సీనియర్ సివిల్ జడ్జి విజయ కల్యాణి

విజయనగరం క్రైమ్: బాలికల వసతిగృహం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుందని, విద్యార్థుల సౌకర్యార్థం తక్షణమే వేరే చోటికి మార్చాలని సంబంధిత యాజమాన్యానికి సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.విజయకల్యాణి సూచించారు.

మహరాణిపేటలో ఉన్న ట్రైబల్ వెల్ఫేర్ గవర్నమెంట్ పోస్ట్‌మెట్రిక్ కాలేజ్ గర్ల్స్ హాస్టల్‌ను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంటగదులు, సరుకులు, రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సులో ఆమె ట్రైబల్ వెల్ఫేర్ చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి రామానందం, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు లక్ష్మీనారాయణ, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

రామ,కృష్ణావతారాల్లో జగన్నాథుడు



కోళ్లబజారులో రామ,కృష్ణావతారాల్లో కొలువైన జగన్నాథుడు

విజయనగరం టౌన్: జగన్నాథుని రథయాత్ర మహోత్సవాల్లో భాగంగా స్థానిక కోళ్లబజారులో కొలువైన జగన్నాథుడు, బలభద్రుడు రాముడు, కృష్ణావతారాల్లో గురువారం భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుడు నగేషాచార్యులు విశిష్ట పూజలు నిర్వహించారు. అదేవిధంగా ఉల్లివీధిలో ఉన్న కళ్లనాయుడు రామమందిరంలో కొలువైన జగన్నాథుడు రామావతారం, కృష్ణావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు ఆరవెల్లి సూర్యనారాయణ సాయి సంపత్ ఆచార్యులు, రామాచార్యులు స్వామివారికి విశేష పూజలు చేపట్టారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని లక్ష్మీపూజలు నిర్వహించారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం నేడు

డెంకాడ: మండలంలోని అక్కివరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం రెండు వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ పి.అప్పలస్వామినాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సబ్‌స్టేషన్, లైన్ల నిర్వహణ పనుల కారణంగా సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు. అక్కివరం, బంటుపల్లి, పేడాడ, రాజులతమ్మాపురం, గొలగాం, గంట్లాం, బెల్లాం, చినఅమకాం, అమకాం గ్రామాల్లో పూర్తిగా.. డి.తాళ్లవలస, టి.కళ్లాం గ్రామాల్లో కొంతభాగం సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

విజయనగరంలో..

విజయనగరం: విద్యుత్ నిర్వహణ పనుల నేపథ్యంలో నగరంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ అధికారులు ప్రకటించారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు అశోక్‌నగర్‌లో గల 11 కేవీ ఫీడర్ పరిధిలో నిర్వహణ పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో డబుల్ కాలనీ, కేంద్రియ విద్యాలయం, ఏడు కోవెళ్ల , బాబామెట్ట ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

దళితులపై దాడులు తగవు

నెల్లిమర్ల: దళితులపై ఎన్డీయే కూటమి నాయకుల దాడులు తగవని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి రేగాన శ్రీనివాసరావు అన్నారు. నెల్లిమర్లలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తాజాగా కొడాలి నాని అనుచరుడు తోట రాజేష్‌పై అక్కడి టీడీపీ నాయకులు దాడిచేసి, భయభ్రాంతులకు గురి చేశారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దళితులపై దాడులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి దాడులు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

సచివాలయ కార్యదర్శులకు మెమోలు

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వార్డు సచివాలయాల్లో నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్న కార్యదర్శులపై కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు కొరఢా ఝుళిపించారు. కొద్దిరోజులుగా నిర్వహిస్తున్న క్షేత్రస్థాయి పర్యటనలో కార్యదర్శుల పనితీరును పరిశీలించిన కమిషనర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న 65 మంది కార్యదర్శులకు మెమోలు జారీ చేశారు. విధులు పేరు చెప్పి వ్యక్తిగత పనుల నిమిత్తం తిరిగే వారితో పాటు నీటిపన్నులు వసూలులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై చర్యలకు ఆదేశించారు.

మెనూ ప్రకారం భోజనం

- డిప్యూటీ డీఈఓ కేవీ రమణ



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న డిప్యూటీ డీఈఓ కేవీ రమణ, తదితరులు

భోగాపురం: విద్యార్థులకు మెనూ ప్రకారమే భోజనాలు పెట్టాలని డిప్యూటీ డీఈఓ కేవీ రమణ సూచించారు. మండలంలోని ముక్కాం, భోగాపురం, రామచంద్రపేటలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలను గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఈఓ మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన విషయంలో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవన్నారు. హెచ్ఎంలు, ఉపాధ్యాయులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచాలని, పారిశుద్ధ్య పనులను ఎప్పటికప్పుడు చేపట్టాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలన్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు రమణమూర్తి, చంద్రమౌళి, ప్రిన్సిపాల్ పార్వతి, హెచ్ఎంలు నర్సింగరావు, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాలతో అద్భుతాలు..



పనికిరాని వస్తువులతో తయారు చేసిన వివిధ రకాల ఆకృతులు

- కార్పొరేషన్ కార్యాలయంలో ఆకట్టుకుంటున్న వివిధ రకాల ఆకృతులు
- ప్రజారోగ్య సిబ్బందిని అభినందించిన కమిషనర్



ప్రజారోగ్య సిబ్బంది తయారు చేసిన ఆకృతులను పరిశీలిస్తున్న కమిషనర్ మల్లయ్యనాయుడు

విజయనగరం: నిరుపయోగ వస్తువులతో అద్భుతాలు చేసి చూపిస్తున్నారు విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన ప్రజారోగ్య విభాగం సిబ్బంది. వ్యర్థాలతో వివిధ రకాల వస్తువులను తయారు చేయడమే కాకుండా ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. ఓవైపు ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలను చైతన్యపరుస్తూనే మరోవైపు వ్యర్థాలతో ఉపయుక్తమైన వస్తువులు తయారుచేసి వినియోగిస్తున్నారు. నిరుపయోగంగా మారిన ట్రాక్టర్ టైర్లను కుర్చీలుగా, టీపాయ్‌లుగా తీర్చిదిద్దారు. అలాగే ప్లాస్టిక్ బాటిళ్లతో గార్డెనింగ్‌కు అవసరమైన విధంగా తీర్చిదిద్దడం ఆసక్తిని కలిగిస్తోంది. రెడ్యూస్, రీసైకిల్, రీయూజ్ (ఆర్ఆర్ఆర్) విధానంలో వ్యర్థాలతో వస్తువులు తయారు చేసి ప్రజలను చైతన్యపరుస్తున్నారు. ఈ విధానం రానున్న రోజుల్లో మరిన్ని విభిన్న ఆకృతులు తయారీకి దోహదపడగలదన్న ఆశాభావాన్ని కార్పొరేషన్ కమిషనర్ ఎం. మల్లయ్యనాయుడు వ్యక్తం చేశారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలు

- సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ అప్పలనాయుడు



రోగి కేస్ షీట్ పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ అప్పలనాయుడు

విజయనగరం ఫోర్ట్: రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంబంగి అప్పలనాయుడు ఆదేశించారు. స్థానిక సర్వజన ఆస్పత్రిలో పలు ఓపీ విభాగాలు, వార్డులను గురువారం ఆయన పరిశీలించారు. జనరల్ సర్జరీ, జనరల్ మెడిసిన్, ఎస్‌సీడీ, న్యూరో మెడిసిన్ విభాగాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా రోగులకు అందిస్తున్న వైద్యసేవలపై ఆరా తీశారు. అవసరం లేకుండా ఏ రోగినీ ఇతర ఆస్పత్రులకు రిఫర్ చేయవద్దన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

టోల్‌గేట్ రద్దుకు తీర్మానం చేయండి

- జెడ్పీ చైర్మన్‌కి వినతిపత్రం అందజేసిన భీశెట్టి



జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుకు వినతిపత్రం అంజేస్తున్న బాబ్జీ, తదితరులు

విజయనగరం ఫూల్‌బాగ్ : విజయనగరం – విశాఖపట్నం మార్గంలో డెంకాడ మండలం జొన్నాడ వద్ద ఏర్పాటు చేయనున్న టోల్‌గేట్‌ను ఎత్తివేయాలని కోరుతూ శుక్రవారం జరగనున్న జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో తీర్మానం చేయాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ కోరారు. ఈ మేరకు జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావును ఆయన కార్యాలయంలో గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం భీశెట్టి విలేకరులతో మాట్లాడుతూ.. టోల్‌గేట్ నిర్మాణ పనులు ప్రారంభించగానే లోక్‌సత్తా పార్టీ, జిల్లా పౌర వేదిక ఆధ్వర్యంలో అప్పటి కలెక్టర్లు సూర్యకుమారి, నాగలక్ష్మి దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ప్రస్తుత కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ దృష్టికి కూడా విషయం తీసుకెళ్లామని చెప్పారు. ప్రజలు కూడా టోల్‌గేట్ వద్దని కోరుతూ ధర్నాలు చేస్తున్నారని, అధికారులు స్పందించి టోల్‌గేట్ ఎత్తివేయాలని కోరారు. కార్యక్రమంలో పౌరవేదిక కార్యదర్శి జలంత్రి రామచంద్ర రాజు, అంబేడ్కర్ రైట్స్ అధ్యక్షుడు డాక్టర్ పీవీ రమణ, వీర్రాజు, జిల్లా చెరువుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు జాగరపు ఈశ్వరప్రసాద్, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

పశువుల సంచారాన్ని అరికట్టాలి



నగరంలో క్షేత్రస్థాయి పర్యటనలో కమిషనర్ మల్లయ్యనాయుడు

- కార్పొరేషన్ కమిషనర్ మల్లయ్యనాయుడు

విజయనగరం: పశువులను విచ్చలవిడిగా రోడ్లపై విడిచిపెడితే ఆ పశువులను స్వాధీనం చేసుకుని యజమానులకు అపరాధ రుసుం విధిస్తామని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఎం. మల్లయ్యనాయుడు స్పష్టం చేశారు. నగరంలోని వివిధ ప్రాంతాలలో గురువారం ఆయన పర్యటించారు. నీళ్లట్యాంక్ జంక్షన్‌లో రహదారిపై విచ్చలవిడిగా పశువులను విడిచిపెట్టడంతో పాటు రోడ్లపైనే పశువ్యర్థాలు ఉండడంతో పెంపకందారులను పిలిచి మందలించారు. ఇటువంటి చర్యలు పునరావృతం అయితే పశువులను స్వాధీనం చేసుకుంటామని స్పష్టం చేశారు. తర్వాత కొత్తపేట నీళ్లట్యాంక్ వద్దకు చేరుకొని అక్కడ నీటి నమూనాలను పరిశీలించారు. ట్యాంకులను శుభ్ర పరుస్తున్నదీ, లేనిదీ ఆరా తీశారు. పైపులైన్ల లీకేజీలనున అరికట్టాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అలాగే కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారాలను తొలగించాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాలు కురిసే సమయంలో అంటురోగాలు ప్రబలే అవకాశం ఉన్న నేపథ్యంలో ముందస్తు చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఈఈ కె.శ్రీనివాసరావు, కార్పొరేటర్ అల్లు చాణక్య, పారిశుధ్య పర్యవేక్షకులు రామకృష్ణ, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.